ప్రపంచానికి తలమానికం భారత ప్రజాస్వామ్యం

● గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి తలమానికమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇంజనీర్స్ భవన్‌లో జరిగిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్ఎఫ్‌జిజి) 15వ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 90 కోట్ల ఓటర్లున్న ఈ దేశంలో ఎన్నికల నిర్వహణ నుంచి మొదలుకుని పాలన వరకు ఎదురయ్యే సమస్యలన్నింటిని ఎప్పటికప్పుడు అధిగమిస్తూ దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతున్నదని పేర్కొన్నారు. ఒక్క ఓటు తేడాతో అటల్‌బిహారి వాజ్‌పేయి ప్రభుత్వం పార్లమెంట్ విశ్వాస పరీక్షలో ఓడిపోయిందనీ, అందువల్ల ప్రజాస్వామ్యానికి ఎవరూ అతీతులు కారని అభిప్రాయపడ్డారు. కార్యనిర్వాహక వ్యవస్థలో మరింత పారదర్శకత రావాల్సిన అవసరముందని చెప్పారు. అందుకు, విద్యార్థులు, యువకులు, మేధావులతో పాటు మొత్తం పౌర సమాజం చొరవ చూపాల్సిన అవపసరముందని పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన, పౌరహక్కుల రక్షణకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్ చేస్తున్న సేవలు మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రజల సామాజిక స్థితిగతులను మార్చే విద్య, వైద్యం ఉపాధి రంగాలపై కాకుండా పాలక వర్గాలు అనవసరమైన పథకాల పేరుతో సంపదను పక్కదారి పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లోనే మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ ఏటా రూ.18 వేల కోట్లు ఉపాధ్యాయుల జీతభత్యాలకు ఖర్చు చేస్తున్నా, విద్యా ప్రమాణాలు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. ఇంకా ఆరువేల స్కూళ్లల్లో సింగిల్ టీచర్లు కొనసాగుతుండగా, ఏడు వేల స్కూళ్లు ఒకే ఒక్క గదిలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల మార్పు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫ్ఎఫ్‌జిజి అధ్యక్షులు ఎం. పద్మనాభరెడ్డి, కార్యదర్శి సోమ శ్రీనివాస్, మాజీ ఐపిఎస్ అధికారి అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్య, వైద్యం వ్యాపారమయం

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"విద్య, వైద్య రంగాలు వ్యాపారమయమై.. ప్రయివేట్ దోపిడీ పెరిగింది.. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడంతో ఆయా రంగాల్లో రిజర్వేషన్లు కరువవుతున్నాయి.. కొద్ది మంది చేతుల్లోనే దేశ సంపద కేంద్రీకృతమైంది.." అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో శనివారం సిపిఎం జిల్లా మూడో మహాసభ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పార్టీ శ్రేణులు ఎర్రజెండాలు చేతబట్టుకుని, బతుకమ్మలు ఎత్తుకుని.. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కెసిఆర్ పాలన పోయి రేవంత్ రెడ్డి పాలన వచ్చినా ప్రజల స్థితిగతులు మారలేదన్నారు. రాష్ట్రంలో సొంత ఇండ్లు లేని కుటుంబాలు 28 లక్షలు ఉండటం బాధాకరమన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కొట్లాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. సమాజంలో అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని, అరికట్టాల్సిన పోలీసు వ్యవస్థ ఉన్నవారికి ఊడిగం చేస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించాలని గొంతెత్తిన వారిపై కేసులు పెడుతూ జైలుకు పంపుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టానికి రానురానూ కేంద్రం నిధులు తగ్గిస్తూపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం పనిచేసేది ఎర్రజెండా మాత్రమేనని, ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎంకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ మహాసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, జగదీష్, జిల్లా కార్యదర్శి మహిపాల్ నాయకులు బుస్సా చంద్రయ్య, రామకృష్ణ, సుదర్శన్, మంగమ్మ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

కోయగూడెం ఒసి-2 నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

● కెఒసిలో భారీ ర్యాలీ, ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైకోర్టు తీర్పును అమలు చేసి కోయగూడెం ఓపెన్ కాస్ట్ (కెఒసి) 2 భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ సింగరేణి డిమాండ్ చేశారు. శనివారం వ్యకాస, భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులు కోయగూడెం ఓసీలో భారీ ర్యాలీ నిర్వహించి, కెఒసి ప్రాజెక్టు అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కెఒసి ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కోయగూడెం ఓసీ-2 పిట్ 1, 2, 3లో సాగు భూములు కోల్పోయిన గిరిజనుల భూమికి నష్టపరిహారం, సాగు భూమి, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా భూసేకరణ చేయడం వల్ల వందలాది మంది గిరిజనులు నష్టపోయారని అన్నారు. 16 సంవత్సరాల న్యాయ పోరాటంలో కిష్టారం, లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండ, కొత్తతండా, జేత్యతండా గిరిజన నిర్వాసితులు గెలిచారని, వెంటనే నష్టపరిహారం, పునరావాసం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం చేయకపోత పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

● పరీక్షల వాయిదాతో విద్యార్థులకు నష్టం
● హైడ్రా అంటే అక్రమార్కులకే భయం : సిఎం రేవంత్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తరచూ పరీక్షలు వాయిదా వేయడం వల్ల విద్యార్థులు నష్టపోతారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో అభ్యర్థులు ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లు, లైబ్రరీల చుట్టూ తిరిగేవారని, వాయిదాల వల్ల విద్యార్థులు ఇతర ఉద్యోగాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. కొన్ని పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు సూచించారు. రాజేంద్రనగర్ పోలీస్ అకాడమీలో శనివారం పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

"నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత నిబంధనలు మారిస్తే కోర్టులు కొట్టివేస్తాయి. జీవో 55 ప్రకారం పోతే.. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు నష్టం జరిగేది. గ్రూప్-1 మెయిన్స్‌లో 1:50కి కూడా రిజర్వేషన్లు పాటిస్తున్నాం. ఉద్యోగాల భర్తీపై గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గడిచిన పదేళ్లలో ఉద్యోగాల భర్తీని అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. గత పదేళ్లలో నిరుద్యోగులను వీళ్లు ఎప్పుడైనా కలిశారా? ఎప్పుడైనా అశోక్ నగర్‌కు వచ్చి మాట్లాడారా? ప్రగతిభవన్‌కు పిలిపించుకున్నారా? పరీక్షల నిర్వహణ విధానాన్ని న్యాయస్థానాలు కూడా సమర్థించాయి. విద్యార్థులు ఆందోళనలు విరమించి పరీక్షలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మోసగాళ్ల మాటలు విని మోసపోవద్దని నిరుద్యోగులను కోరుతున్నాను. ఆందోళన చేస్తున్న విద్యార్థుల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించవద్దని కోరుతున్నా" అని రేవంత్ పేర్కొన్నారు.

పెనుసవాల్‌గా సైబర్ నేరాలు

సైబర్ నేరాలు కూడా ప్రజలకు, పోలీసులకు పెను సవాల్‌గా మారాయని అన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిందని గుర్తు చేశారు. "సమాజంలో నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో జరిగిన నేరాలకు, ప్రస్తుత నేరాలకు పొంతన లేదు. డ్రగ్స్ మహమ్మారి రాష్ట్రానికి సవాలుగా మారింది. పొరుగు రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి గంజాయి రవాణా పెరిగింది. జిల్లాల్లోని పోలీసులు గంజాయిని రాష్ట్ర సరిహద్దుల్లోనే సమర్థంగా అడ్డుకోవాలి" అని పిలుపునిచ్చారు. చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాలాలు, చెరువులను ఆక్రమించుకున్న వారే హైడ్రాను చూసి భయపడుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "హైడ్రాను చూసి రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీయాలని కొంతమంది చూస్తున్నారు. అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావుకు ఫాంహౌస్ లేదా? గతంలో కాంగ్రెస్ వల్లనే హరీశ్‌రావుకు మంత్రి పదవి వచ్చింది. కెసిఆర్ కుటుంబానికి దోపిడీ చరిత్ర ఉంది. తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని చూస్తున్నారు " అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డును సిఎం ప్రదానం చేశారు. గీతారెడ్డికి ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. 'దేశ సమగ్రత కోసం 34 ఏళ్ల క్రితం రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారు. ఏటా వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు వెళ్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన గీతారెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయం. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రధాని పదవులను త్యాగం చేసిన ఘనత సోనియా, రాహుల్‌ది. రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు... వారికి నేను హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. హైడ్రా ఆగదు.. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు. హైడ్రా అనగానే హరీశ్‌రావు, కెటిఆర్ బయటకు వస్తున్నారు. పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేకపోతున్నారు. మూసీలో మగ్గిపోతున్న వారికి ఇళ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందించాం. మేం వారిని గుండెల్లో పెట్టుకుంటుంటే బిఆర్ఎస్ నేతలు గుండెలు బాదుకుంటున్నారు. హరీశ్‌రావు, కెటిఆర్ ఫామ్ హౌస్‌ల విషయంపై అఖిలపక్షాన్ని పిలుద్దాం. నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు నిగ్గు తేల్చుదాం. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనా వెళదాం." అని అన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల్లో పనిచేస్తున్న కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులకు అర్హతలున్నప్పటికీ ఎన్నికల కోడ్, వివిధ కారణాల రీత్యా రెగ్యులరైజ్ చేయలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. దీంతో వారు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా వారిని కూడా తక్షణమే రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గతేడాది మూడో తేదీన కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులను 16 జిఒ ద్వారా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందని తెలిపారు. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ వృత్తివిద్యా కోర్సుల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న 410 మంది, జనరల్ విభాగంలో 23 మంది, ఉర్దూ మీడియం లాంగ్వేజ్ సమస్య ఉన్న 13 మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నెట్/స్లెట్/పీహెచ్‌డీ అదనపు అర్హతలున్న 150 మంది, 2014 జూన్ రెండు తర్వాత అర్హతలున్న 24 మంది, ఈ ఏడాది జూన్ రెండు తర్వాత అదనపు అర్హతలు సాధించిన 11 మందిని రెగ్యులరైజ్ చేయలేదని వివరించారు. అదే విధంగా కాంట్రాక్టు అధ్యాపకులుగా నియామకం సమయంలో సరైన అర్హతలున్నప్పటికీ, ప్రస్తుతం అదనపు అర్హతల కోసం మరో 515 మందిని కూడా రెగ్యులరైజ్ చేయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో ఉన్న అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

మొక్కజొన్నను మద్దతు ధరకు కొంటాం

● మార్క్‌ఫెడ్ ఎమ్‌డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలంలో పండిన మొక్కజొన్న పంటను మద్దతు ధరకు కొంటామని మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 5,46,865 ఎకరాల్లో సాగైందనీ, పంట దిగుబడి 9,63,102 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 2225 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. అందుకు నాఫెడ్ కూడా అంగీకరించిందని తెలిపారు. మద్దతు ధరకనుగుణంగా మొదటగా నాఫెడ్ తరపున జగిత్యాల, నిర్మల్ జిల్లాలతోసహా 12 కేంద్రాలను శనివారం నుంచి ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

పిడుగుపాటుతో మహిళా రైతు మృతి

హైదరాబాద్ బ్యూరో : మహబూబాబాద్ జిల్లాలోని సీరోల్ మండలం అందనమాలపాడులో శనివారం సాయంత్రం పిడుగు పడటంతో మహిళా రైతు పోతురాజు వెంకటమ్మ(45) ప్రాణం కోల్పోయారు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటమ్మ పంటపొలంలో పని చేస్తున్న సమయంలో ఆమెకు సమీపంలో పిడుగు పడింది. అక్కడికక్కడే ఆమె మృతిచెందారు. విషయం తెలుసుకున్న కిసాన్ పరివార్‌సిఇఒ, డాక్టర్ వివేక్ ఆదేశానుసారం కిసాన్ పరివార్ టీమ్ మహబూబాబాద్ జిల్లా కో- ఆర్డినేటర్ హరిబాబు, సీరోల్ మండల కోఆర్డినేటర్ బానోతు విషు నాయక్ గ్రామానికెళ్లి పరిశీలించారు.

డిసెంబర్‌లోపు రూ.2 లక్షల రుణమాఫీ

● అంత కంటే ఎక్కువ అప్పున్న రైతులకు షెడ్యూల్ ఇస్తాం
● వానాకాలం నుంచి రైతు భరోసా
● పంటల బీమా కోసం త్వరలో టెండర్లు
● వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులకు డిసెంబర్‌లోపు మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అంత కంటే ఎక్కువ అప్పు ఉన్న రైతులకు షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. ఆ షెడ్యూల్ ప్రకారం మాఫీ అవుతుందని స్పష్టంచేశారు. శనివారం హైదరాబాద్ లోని బిఆర్‌కెఎస్ భవన్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చైర్మన్లు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి, రైతు సంఘాల నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు, పశ్యపద్మ, పలువురు వ్యవసాయ నిపుణులుతో కలిసి మంత్రి విలేకర్లతో మాట్లాడారు. అంతకు ముందు వారితో సమావేశమయ్యారు. పంట బీమా కోసం త్వరలో టెండర్లను ఆహ్వానిస్తామన్నారు. రైతు మెరుగైన బీమా సౌకర్యం కల్పించిన కంపెనీలకు అప్పగిస్తామని తెలిపారు. పంటల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నదని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను తాకట్టు పెట్టి రుణమాఫీ చేసిందని విమర్శించారు. దీంతో రైతులు రుణవిముక్తి కాలేదని చెప్పారు. ఇప్పటికే రుణమాఫీ కోసం రూ. 18వేల కోట్లు ఖాతాల్లో జమ చేసినట్టు పునరుద్ఘాటించారు. రుణమాఫీ కాని రైతుల కోసం క్షేత్రస్థాయిలో రెండు నెలలుగా నిర్ధారణ చేసినట్టు తెలిపారు. వారికి రూ. 25వేల కోట్లు ఇస్తామని తెలిపారు. పంటల బీమా ఎకరాకు పదివేల చొప్పున ఇస్తామని భరోసా ఇచ్చారు. పప్పు ధాన్యాలను మార్కెడ్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. మంత్రివర్గ ఉప సంఘం నివేదిక రాగానే రైతు భరోసా ఇస్తామని తెలిపారు. వచ్చే వానాకాలం నుంచి పంట వేసిన రైతులకే రైతు భరోసా జమ చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కోహెడలో పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు. ఆ రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని అధికారులను ఆదేశించామన్నారు. చెప్పిన మాట ప్రకారం ఈ ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేస్తున్నదని తెలిపారు. గత ప్రభుత్వం ఇవ్వకుండా వదిలేసిన చాలా పథకాలకు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయటం రైతుల పట్ల వారి సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి గల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వ్యవసాయ ప్రణాళిక, వ్యవసాయాభివృద్ధికి పథకాల రూపకల్పన అనే అంశాలపై మంత్రికి ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం నేతలు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు వినతిపత్రం సమర్పించారు.

చిరుధాన్యాలను ప్రోత్సహిస్తాం

చిరుధాన్యాల ప్రాధాన్యత రీత్య రాష్ట్రంలో వాటిని ప్రోత్సహిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'అంతర్జాతీయ పోషక చిరుధాన్యాల సమ్మేళనం'లో మంత్రి మాట్లాడారు. చిరుధాన్యాల భవిష్యత్తు గురించి చర్చించేందుకు ఈ సమ్మేళనం ఒక కీలకమైన వేదిక అన్నారు. చిరుధాన్యాలకు గొప్ప చరిత్ర ఉందని చెప్పారు. జొన్నలు, సజ్జలు, రాగులు వంటి ధాన్యాలు తక్కువ నీటిని వినియోగించి తడి వాతావరణంలో సైతం పండించే అవకాశం ఉందన్నారు. శుద్ధిచేసిన (రిఫైన్) ధాన్యాలపై ఆధారపడటం వల్ల వాటిని వినియోగం తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో చిరుధాన్యాల వినియోగం 1980వ దశకంలో తొమ్మిది మిలియన్ టన్నులుంటే, ప్రస్తుతం 4.5 మిలియన్ టన్నుల వరకు తగ్గిపోయిందని చెప్పారు. వాటిని రోజువారీగా ఆహారంలోకి తెచ్చేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. వర్షాభావం, అనిశ్చిత వాతావరణ పరిస్థితులు కలిగిన ప్రాంతాల్లో సైతం చిరుధాన్యాలను సులువుగా సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జంక్‌ఫుడ్‌కు అలవాటుపడటం వల్ల పోషకాహార లోపంతో కూడిన ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుధాన్యాలను కృత్రిమ ఆహారాలకు ప్రత్యామ్నాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రయివేటు సంస్థలకు ఆయన అభినందనలు తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు సర్వం సిద్ధం

● రేపటినుంచి పరీక్షలు ప్రారంభం
● హెచ్‌ఎండిఎ పరిధిలో 27 వరకు నిర్వహణ
● 46 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
● హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. హెచ్‌ఎండిఎ పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు జరుగుతున్నాయి. దీంతో అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) సర్వంసిద్ధం చేసింది. ఏ విధమైన పొరపాట్లకు తావు లేకుండా, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లో ఎనిమిది, రంగారెడ్డిలో 11, మేడ్చల్ మల్కాజిగిరిలో 27 కలిపి మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టిజిపిఎస్‌సి జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాలన్నింటిలోనూ సిసిటివిలను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. టిజిపిఎస్‌సి కార్యాలయంలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే సమయంలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించేవిధంగా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. పరీక్షలు నిర్వహించే రోజుల్లో అన్ని కేంద్రాలకూ ప్రత్యేకంగా ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేసినట్టు సంబంధిత అధికారులు ప్రకటించారు.

రేపటి నుంచి 'ఎస్‌ఎ-1' పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సోమవారం నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 28 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లోనూ ఎస్‌ఎ-1 పరీక్షల నిర్వహణ వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. నవంబర్ రెండున జవాబుపత్రాల మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని విద్యాశాఖ షెడ్యూల్‌ను రూపొందించింది. అదే నెల ఐదున విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయాలని తెలిపింది. అదే నెల 16న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాన్ని నిర్వహించాలనీ, విద్యార్థుల మార్కులు, వారి ప్రతిభపై చర్చించాలని కోరింది.

ఆస్పత్రి నుంచి బాలుడి కిడ్నాప్

హైదరాబాద్ బ్యూరో : నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో తండ్రితో పాటు నిద్రిస్తున్న ఏడాది వయస్సు ఉన్న బాలుడు కిడ్నాప్ అయ్యాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా మద్నూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆమె వెంట భర్త రాజు, కొడుకు మణికంఠ (ఏడాది) ఆస్పత్రిలోనే ఉన్నారు. రాత్రి నిద్రపోయాక.. రాజు పక్కన పడుకున్న బాలున్ని గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున లేచి చూసే సరికి కొడుకు లేకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, బాలున్ని కిడ్నాప్‌కు సంబంధించి సిసిటివి కెమెరాలో నిక్షిప్తమైంది. ఆస్పత్రి వద్ద సిఐఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు కాపలా ఉన్నా.. బాలుడి కిడ్నాప్ జరగడం కలకలం రేపింది. ఈ ఏడాది ఇది రెండో ఘటన. కిడ్నాప్‌లే కాకుండా ఇటీవల మిస్సింగ్ కేసులు కూడా ప్రభుత్వాస్పత్రిలో జరిగాయి.

పోలీసులమని చెప్పి రూ.50 వేలు లూటీ

- విచారణ చేపట్టిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ నగరంలో పోలీసులమని చెప్పి ఒక వ్యక్తి వద్ద రూ.50 వేలు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని నాగారామ్‌కు చెందిన నర్సగౌడ్ ఈ నెల 17న నగరంలోని ప్రభాత్ టాకీస్ వద్ద ఉన్న మద్యం షాపులో మద్యం తాగేందుకు వెళ్లాడు. ఆ సమయంలో నలుగురు వ్యక్తులు వచ్చి పోలీసులమని చెప్పి అతడిని పక్కకు తీసుకెళ్లారు. రూ.ఆరు వేలు, సెల్‌ఫోన్ లాక్కుని.. అతన్ని ఖానాపూర్ శివారుకు తీసుకెళ్లారు. 'నువ్వ్ పలాన కేసులో ఉన్నావ్. నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేస్తున్న కేసు నమోదైంది' అంటూ విచారణ పేరిట వేధించారు. అక్కడి నుంచి బైపాస్ రోడ్డులోని శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి మద్యం తాగుతూ మళ్లీ ఇంటరాగేషన్ పేరిట వేధించారు. అనంతరం బైక్‌ల మీద మాణిక్ బండార్(చెక్క) వద్ద కల్లు బట్టీకి తీసుకెళ్లారు. చివరకు బాధితుడి భార్యకు ఫోన్ చేసి.. విచారణకు తీసుకెళ్తున్నామని, రూ.2.50 లక్షలు తీసుకొస్తే వదులుతామని బెదిరించారు. దీంతో నర్సగౌడ్ భార్య వెంటనే మరో వ్యక్తితో కలిసి వారి వద్దకొచ్చి రూ.50వేలు ఇచ్చి భర్తను విడిపించుకుంది. ఆ తర్వాత మళ్లీ పోన్ చేసి రూ.రెండు లక్షలు తెచ్చివ్వాలని దుండగులు బెదిరించడంతో బాధితులు ఈ నెల 18న మూడవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపడుతున్నట్టు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

104 ఉద్యోగులను కొనసాగిస్తాం

- టియుఎంహెచ్ఇయు నాయకులతో కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

104 ఉద్యోగులను కొనసాగిస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ హామీ ఇచ్చారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కార్యదర్శులు వి.విజయవర్ధన్ రాజు నాయకత్వంలో నాయకులు కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండేండ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా జీవిస్తున్నారనీ, 2021లో గత ప్రభుత్వం 104 ఎఫ్‌డీహెచ్ఎస్ సర్వీసులను రద్దు చేసిందని తెలిపారు. దాదాపు 1,100 మంది ఉద్యోగులను సర్దుబాటు చేసి కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థికశాఖ సలహా, సూచన ప్రాకరం డిపార్ట్‌మెంట్ పరిధిలో గల డిఎంఇ, డీహెచ్, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో, కార్యాలయాల్లో అందరిని కొనసాగిస్తామనీ, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. అదే విధంగా ఈ ఏడాది అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు సుభాష్ చందర్, శేఖర్, గద్వాల శేఖర్, నాగన్న, నాగర్ కర్నూల్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న 'ఉపాధి'

- ఈ ఏడాది 16.2 శాతం తగ్గిన పని దినాలు
- కేంద్రం నిధుల తగ్గింపు ఓ కారణం
- ప్రతిబంధకంగా ఆన్‌లైన్ మస్టర్, ఆధార్ అనుసంధానం, డ్రోన్ల పర్యవేక్షణ
- లిబ్‌టెక్ నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో కొనుగోలు స్థాయిని పెంచడం, సామాజిక అంతరాలను తగ్గించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పేదలకు పనిదినాలు దక్కకుండా పోతున్నాయి. కాదు..కాదు..కేంద్రంలోని మోడీ సర్కారు ఆ చట్టానికి ఏటేటా నిధులను తగ్గిస్తూ, అరకొర వేతనాలు పడేలా చూస్తూ పేదలే ఆ పనుల నుంచి దూరం జరిగేలా చూస్తున్నది. దాని ఫలితం ఉపాధి హామీ పనిదినాల క్షీణతలో స్పష్టంగా కనిపిస్తున్నది. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జాతీయ స్థాయిలో ఉపాధి పనిదినాలు 16.2 శాతం తక్కువ నమోదయ్యాయి. ఈ చట్టం అమలుకు ఆన్‌లైన్ మస్టర్, ఆధార్ అనుసంధానం, డ్రోన్ల పర్యవేక్షణ ప్రతిబంధకంగా మారాయని తెలుస్తున్నది. గతేడాదితో పోలిస్తే దేశవ్యాప్తంగా 7.4 శాతం పనిదినాల సంఖ్య తగ్గింది. తెలంగాణలో మాత్రం 27.1 శాతం పెరుగుదల కనిపించింది. ఉపాధి హామీ చట్టాన్ని అత్యంత ప్రభావితంగా అమలు చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉంది. ఉపాధి హామీ చట్టం కింద పనిదినాల కల్పనపై లిబ్‌టెక్ సంస్థ నివేదిక పలు కీలకాంశాలను వెల్లడించింది.

చట్టం ప్రకారం పని అడిగిన ప్రతి కుటుంబానికి ఏడాదిలో కనీసం వంద రోజుల పని కల్పించాలి. కానీ, ఎక్కడ కూడా వంద రోజుల పని కల్పించిన దాఖలాలు లేవు. దేశ సగటు చూస్తే ఒక కుటుంబానికి కేవలం 34.81 రోజుల పనిదినాలనే కేంద్ర ప్రభుత్వం కల్పించింది. అదే తెలంగాణకు వచ్చేసరికి ఆ సగటు కాస్తా పెరిగింది. తెలంగాణలో ప్రతి కుటుంబానికి సగటున 40.9 రోజుల పని దక్కింది. తెలంగాణలో 6



అక్టోబర్ 2024 నాటికి 53.07 లక్షల జాబ్‌కార్డులున్నాయి. అందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 34.53 లక్షలుండగా అందులో కేవలం 25.33 లక్షల కుటుంబాలే ఉపాధి పనుల్లో పాలుపంచుకున్నాయి. సగం జాబ్‌కార్డు హోల్డర్లు పనులకు దూరంగా ఉన్నారనేది స్పష్టంగా అర్ధమవుతోంది. తెలంగాణలో కామారెడ్డి, ములుగు, వరంగల్ జిల్లాలు ఉపాధి హామీ పనుల కల్పనలో ముందంజలో ఉన్నాయి. రంగారెడ్డి, సంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో తగ్గుదల ఉంది. సంగారెడ్డి జిల్లాలో 2022-24 ఆర్థిక సంవత్సరంలో 46 లక్షల వ్యక్తిగత పనిదినాలు కల్పించబడితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి అది కాస్తా 43 లక్షలకు పడిపోయింది. ఈ ఏడాది ఆ ఒక్క జిల్లాలోనే మూడు లక్షల పనిదినాలు తగ్గాయి. ఆ జిల్లాలో ఆరుశాతం తగ్గినట్టయింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలో ఉపాధి హామీ పనుల ప్రక్రియ మంచిగానే ప్రారంభమైంది. మే నెలలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కొర్రీలు పెట్టడం, పనుల కేటాయింపు ఇష్టానుసారంగా కేటాయించారనే సాకు చూపెట్టడం లాంటి వాటితో జూన్‌లో పనిదినాల నమోదు గణనీయంగా తగ్గింది. రాష్ట్రంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు చూస్తే జులైలో తక్కువ పనిదినాలు కల్పించబడ్డాయి. జులై నెలకు వచ్చేసరికి 41.5 శాతంతో అత్యంత తగ్గుదల కనిపించింది.

కార్మికులు తగ్గడానికి కారణాలివే..

ఆధార్‌కార్డు, ఉపాధి జాబు కార్డు నెంబర్, బ్యాంక్ అకౌంట్ అనుసంధానం ప్రధాన సమస్యగా ముందుకు రావడం వల్ల పెద్ద ఎత్తున జాబుకార్డులు తొలగించబడ్డాయని వ్యవసాయ కార్మిక సంఘాలు చెబుతున్నాయి. దేశంలో 7.5 కోట్ల జాబ్‌కార్డులను కేంద్ర ప్రభుత్వం తొలగించింది.

పని ప్రదేశంలో ఆన్‌లైన మస్టర్ తప్పనిసరి చేయడం కూడా ఇబ్బందికరంగా మారింది. పనిప్రదేశాల్లో నెట్ రాకపోవడంతో కార్మికులు పనిచేసినా మస్టర్‌ను కిందిస్థాయి సిబ్బంది వేయలేకపోయారు. ఫలితంగా రికార్డుల్లో కార్మికులు సంఖ్య తగ్గిపోయింది. అటవీ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. తెలంగాణలో రోజువారీ వేతనాలు కూడా తక్కువగా పడుతున్నాయి. తెలంగాణ విషయానికే వస్తే రాష్ట్రంలో రూ.125 సగటు కూలి పడుతున్నది. బయట పనికెళ్తే రోజు కూలి రూ.300 నుంచి రూ.700 వరకు దక్కుతున్నది. మరోవైపు ఆ అరకొర వేతనాలను పెండింగ్‌లో పెడుతున్న పరిస్థితి. ఉపాధి హామీ పనులకు పోతే వేతనాలు సరిగా రావు అనే అభద్రతాభావం కార్మికుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఫలితంగా పనులకు రావడానికి కార్మికుల్లో అనాసక్తి కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యాలకు నీళ్లొదిలి వ్యవసాయానికి అనుసంధానం చేసే ప్రక్రియ ఊపందుకున్నది. వ్యవసాయ పనులకు కార్మికులు దొరకడం లేదనే సాకును పాలకులు చూపెడుతున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరో అవకాశం ఇవ్వండి

- ఆలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి తనకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం వరంగల్ జిల్లా రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత గల ఉపాధ్యాయులందరూ నవంబర్ ఆరులోపు ఓటరుగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఎమ్మెల్సీగా తనను మరోసారి గెలిపిస్తే ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి నిరంతరం నిజాయితీగా పనిచేస్తానని అన్నారు. అనంతరం కాశిబుగ్గ, శివనగర్, పైడిపల్లి, ఆరెపల్లి ప్రభుత్వ పాఠశాల పాఠశాలను నర్సిరెడ్డి సందర్శించి తనకు మరోసారి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, సుజన్ ప్రసాదరావు, కోశాధికారి రావుఫ్, కార్యదర్శి నామోజు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఉద్యోగుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లండి

- కూనంనేనికి టిజిజెఎల్ఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) కోరింది. ఈ మేరకు ఆయనకు శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ వినతిపత్రం పంపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలు విడుదలయ్యేలా చూడాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని తెలిపారు. నూతన పిఆర్‌సిని ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేలా చూడాలని కోరారు. తెలంగాణ ఉద్యోగ జెఎసి నాయకులతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చించి సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి

డిసెంబర్‌లో పుస్తక మహోత్సవం

- 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి జూపల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నేటి సమాజంలో పుస్తకాలు చదివే సంస్కృతి మరింత పెరగాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డిసెంబర్ 19 నుంచి 29 వరకు హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగే పుస్తక మహోత్సవాన్ని పుస్తకప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ ఆఫీసులో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. బుక్‌ఫెయిర్ నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసానిచ్చారు. మూడు దశాబ్దాలుగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అనుకూలంగా హైదరాబాద్‌లో బుక్‌ఫెయిర్‌ను పెడుతున్న నిర్వాహకులను అభినందించారు. పదిరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పుస్తక ప్రియులు, విద్యార్థులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్ మాట్లాడుతూ.. బుక్‌ఫెయిర్‌లో ప్రచురణకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బుక్‌ఫెయిర్ ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు మాట్లాడుతూ.. బుక్‌ఫెయిర్‌లో 250కిపైగా జాతీయ, అంతర్జాతీయ పబ్లిషర్లు పాల్గొంటారనీ, పదిలక్షల మందికిపైగా పుస్తకప్రియులు సందర్శించే అవకాశం ఉందని తెలిపారు. సందర్శకులకు, రచయితలకు, స్టాల్ నిర్వాహకులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఐడీ కార్డులు చూపించి ఉచితంగా సందర్శించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, సంయుక్త కార్యదర్శులు కె.సురేశ్, ఎం.సూరిబాబు, ఈసీ సభ్యులు జనార్ధన్‌గుప్తా, విజయారావు, మధుకర్, కోటేశ్వర్‌రావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, సాంబశివరావు, స్వరాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యంతో ఎన్నో లాభాలు

- కేంద్ర మాజీ మంత్రి సముద్రాల

ప్రజాశక్తి - కల్చరల్

శాస్త్రీయ నృత్యం వల్ల మానసిక ఆనందమే కాకుండా మరెన్నో లాభాలు ఉన్నాయని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. నాట్యం నేర్చుకున్న వారిలో ఐక్యూ ఎక్కువని, జిమ్, యోగా వారికి అవసరం లేదని చెప్పారు. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ నాట్య సంస్థ నృత్య కిన్నెర నిర్వహణలో విఖ్యాత కూచిపూడి నాట్య గురువు వేదాంతం జగన్నాథ శర్మ 42వ వర్ధంతి సందర్భంగా ప్రముఖ నాట్య గురువు డాక్టర్ అర్ ప్రసన్న రాణికి పురస్కార ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణు గోపాలాచారికి పురస్కారం బహుకరించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్రీయ నృత్యం మార్పు చెందాలని నేటి తరానికి ఆసక్తి కలిగించాలని కోరారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త వోలేటి పార్వతీశం మాట్లాడుతూ.. వేదాంతం జగన్నాథ శర్మ కూచిపూడి నాట్య ప్రక్రియను ఉన్నత స్థానానికి నిలిపిన ప్రముఖులు అని వివరించారు. ఆయన శిష్యురాలు ఉషా గాయత్రి గురువు సంస్మరణగా ప్రతి ఏటా నృత్య గురువులను సత్కరించటం గురుపరంపరకు ఉదాహరణ అన్నారు. సినీ నటన కన్నా నాట్యానికి ప్రసన్న రాణి ప్రాధాన్యత ఇచ్చి ఎందరో నృత్య కళాకారులను తయారు చేస్తున్నారని అభినందించారు.

కవిగా 'కోట్ల' ప్రయోగశీలి

- మనసులోని కవితనై కవితా సంపుటి ఆవిష్కరణలో మాజీ మంత్రి సింగిరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సుప్రసిద్ధ కవి, కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి ప్రయోగశీలి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించారు. శనివారం హైదరాబాద్‌లోని మంచిరేవుల క్రాస్‌రోడ్‌లోని డ్యూవిల్లె క్లబ్‌హౌస్‌లో కోట్ల కవితానువర్తనం చేసిన 'మనుసులోని కవితనై' కవితా సంపుటిని నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాత్రికేయులు ఆనందాచారి రాసిన సంపాదకీయాలను కవితానువర్తనం చేయడం కొత్త తరానికి ఎంతో స్పూర్తిదాయకమని ప్రశంసించారు. వెంకటేశ్వరరెడ్డి నిత్య కవితా చైతన్యశీలి అని కొనియాడారు. సభాధ్యక్షులు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు మాట్లాడుతూ..వర్తమాన సమాజం మీద చిత్తశుద్ధితో కవిత్వం రాస్తున్న కవుల్లో కోట్ల ఒకరని ప్రశంసించారు. కె.ఆనందాచారి మాట్లాడుతూ..కావ్యాన్ని తనకు అంకింతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తన సంపాదకీయాన్ని కవితానువర్తనం చేయడం తెలుగు సాహిత్యంలో ఒక ప్రయోగం అన్నారు. ఈ కవితా సంపుటిని అనంతోజు మోహనకృష్ణ సమీక్షిస్తూ కోట్ల వెంకటేశ్వర రెడ్డి కవితా రచనలో కొత్త తరానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారని కొనియాడారు. ఈ సభలో ఆత్మీయ అతిథులుగా కాసుల ప్రతాపరెడ్డి, ఒద్దిరాజు ప్రవీణ్, ఎం.వి.రాఘవరెడ్డి, అరిగె రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతకాకుంటే తప్పుకో

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలన చేతకాకుంటే ప్రజలకు క్షమాపణ చెప్పి సిఎం రేవంత్ రెడ్డి తప్పుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కాంగ్రెస్ కార్యకర్తలతో బుల్డోజర్లు నడిపించి కెటిఆర్, హరీశ్‌రావులను చంపుతా అంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిజిపిని కోరారు. మూసీ పేరుతో జరిగే దోపిడీపై ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. రైతులను, ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కార్‌పై జనాల్లో అసహనం పెరిగిందని చెప్పారు. గ్రూప్-1 ఆందోళనకు బండి సంజయ్ మద్దతు రేవంత్ రెడ్డి కుట్రలో భాగమేనని తెలిపారు.

విచారణ పేరుతో కాలయాపన చేయొద్దు

- రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల తక్షణ పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. భూపాలపల్లి ఐడిఒసి కార్యాలయ సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్‌పి కిరణ్ ఖరేతో కలిసి శనివారం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, సర్వీస్ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, ఎస్‌పిగా యువకులున్నారని అన్ని సమస్యల పరిష్కారానికీ చర్యలు తీసుకుంటారని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులను వారం రోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పారని అన్నారు. వారం రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించి నివేదిక అందజేయాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో అలసత్వం వహించే అధికారులపై తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మూడు నెలలకు ఒకసారి తప్పక జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. అన్ని మండలాల్లో ప్రతి నెల చివరి వారంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహణపై కార్యాచరణ తయారు చేయాలన్నారు. దినోత్సవ నిర్వహణపై ముందస్తు సమాచారం ఇవ్వాలని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని, ఎస్‌సి, ఎస్‌టి హక్కులు, చట్టాలు గురించి అవగాహన కల్పించాలని అన్నారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో ఎస్‌సిల ఇల్లు కూల్చారని బాధితులు తెలుపగా.. నివేదికలు అందచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేస్తారా?

- మంత్రి తుమ్మల ప్రకటనపై కెటిఆర్ ఆగ్రహం
- నేడు అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్యాబినెట్ సబ్‌కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాతే రైతు భరోసా ఇస్తామంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేసిన ప్రకటనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి తన ప్రకటన ద్వారా వర్షాకాలం సీజన్ రైతు భరోసాను ఎగ్గొట్టినట్టేనని చెప్పారు. ఇది కచ్చితంగా రాష్ట్ర రైతాంగాన్ని మోసం చేయటమేనని కెటిఆర్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం కెటిఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యకు నిరసనగా ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో నిరసన చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతుబంధును పూర్తిగా ఎత్తి వేసే కుట్రలో భాగంగానే రైతు భరోసా పేరుతో క్యాబినెట్ సబ్ కమిటీ, కొత్త మార్గదర్శకాలు అంటూ డ్రామా చేస్తున్నారని విమర్శించారు. వానాకాలం పంట సీజన్‌కు రైతు భరోసాను పూర్తిగా ఎగ్గొట్టి లక్షలాది మంది రైతుల నోట్లో రేవంత్ రెడ్డి మట్టి కొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కడుపు కొట్టి రూ.లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణ చేసేందుకు డబ్బులున్నాయి గానీ రైతులకు రూ.15 వేల కోట్లు ఇచ్చేందుకు పైసలు లేవా? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో ఎకరానికి ఏటా రూ.15 వేలు, రైతు కూలీలకు, కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం, ధాన్యానికి రూ. 500 బోనస్ అని బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని తెలిపారు. రుణమాఫీ పేరుతోనూ రైతులను చేసిన మోసం చాలదన్నట్టు, ఇప్పుడు రైతు భరోసా విషయంలోనూ దగా చేస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు ఇస్తామన్న వానాకాలం రైతు భరోసా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.



గ్రూప్ 1 అభ్యర్థులతో చర్చించాలి

పరీక్ష వాయిదా వేయాలని కోరుతున్న గ్రూప్ 1 అభ్యర్థులతో చర్చించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పరీక్ష వాయిదా వేయకుండా ఎందుకు మొండిగా వ్యవహరిస్తున్నారని చెప్పాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పోలీస్ సెక్యూరిటీ ఇచ్చి ర్యాలీ చేయించిన సీఎం రేవంత్ రెడ్డి, తమ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముఠా గోపాల్ తదితరులతో పాటు గ్రూప్ 1 అభ్యర్థులను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రూప్ 1 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారనీ, సోమవారం ఉదయం విచారణ ఉందని తెలిపారు.

హైదరాబాద్‌ను స్టార్టప్ సంస్థలకు కేరాఫ్ అడ్రస్ గా తీర్చిదిద్దాం : ఇస్బాకాన్ సదస్సులో కెటిఆర్

హైదరాబాద్ నగరాన్ని స్టార్టప్ సంస్థలకు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దామని ఐటీశాఖ మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్‌క్లూజివ్ గ్రోత్ అనే మూడు సుత్రాలతో నగరంలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను నిర్మించామన్నారు. తార్నాకలోని సిసిఎంబిలో జరిగిన ఇస్బాకాన్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కల్పించాలంటే స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించటమే సరైన మార్గమని తాను భావించానని చెప్పారు. టీ హబ్ గ్రోత్ స్టోరీని ఈ సందర్భంగా కేటీఆర్ వివరించారు. టీ హబ్, టీ వర్క్స్, ఇమ్మేజ్ టవర్స్ పేరుతో దేశంలోనే అతి పెద్ద ఇంక్యుబేటర్ సెంటర్ హైదరాబాద్‌లో తీర్చిదిద్దామన్నారు. 2 వేల స్టార్టప్ కంపెనీల కెపాసిటీతో ప్రారంభమైన టీ హబ్ సక్సెస్ కావటంతో ఆ తర్వాత టీ వర్క్స్ , ఇమ్మేజ్ టవర్స్ పేరుతో ఒకే చోట 5 వేల స్టార్టప్ కంపెనీలకు గైడెన్స్ చేసే విధంగా తీర్చిదిద్దామన్నారు.

2014లో హైదరాబాద్‌లో 2 వందల స్టార్టప్ కంపెనీలుంటే ప్రసుత్తం 5 వేలకుపైగా స్టార్టప్ కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. రతన్ టాటా లాంటి గొప్ప వ్యక్తి టీ హబ్‌ను ఆధునిక భారత ముఖచిత్రం అంటూ ప్రశంసించటాన్ని ఎంతో గర్వంగా భావించానని కెటిఆర్ గుర్తుచేసుకున్నారు. భారత్ స్వదేశీ టెక్నాలజీతో ప్రయోగించిన మొదటి శాటిలైట్ ప్రయోగంలో హైదరాబాద్‌లోని స్టార్టప్ కంపెనీయే కీలక పాత్ర పోషించిందని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న మొత్తం స్టార్టప్ కంపెనీలు ఏటా 3.5 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చెప్పారు. టైర్-2, టైర్-3 నగరాలకు కూడా ఈ ఎకో సిస్టమ్ విస్తరించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా మాజీ మంత్రి అభిప్రాయపడ్డారు.

మూసీకి అడ్డుపడితే మహోద్యమం

- కెసిఆర్, కెటిఆర్, హరీశ్ ఫాంహౌస్‌లను ముట్టడిస్తాం
- మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంతో పాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో కోటిన్నర మంది ప్రజలకు మేలు చేసే మూసీ శుద్ధీకరణ పనులను అడ్డుకుంటే రజాకార్లపై తిరుగుబాటు తరహాలో మహోద్యమం మళ్లీ పునరావృతం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. మూసీ కాలుష్యంతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్యాయం జరిగిందనే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకుంటే, గడిచిన పదేండ్లలో నల్లగొండ జిల్లాకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ప్రజలకు పోరాటాలు కొత్తకాదనీ, ఇలాగే మూసీకి అడ్డం పడితే మీ ఇండ్ల ముందు శాంతియుతంగా లక్షలమంది నల్లగొండ బిడ్డలతో కలిసి ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. మూసీకి అడ్డుపడే ప్రతి రాజకీయ పార్టీని నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్‌లో ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని అభిప్రాయపడ్డారు. మూసీ కాలుష్యంతో ప్రజలు క్యాన్సర్, నరాల జబ్బులు, గుండె, కిడ్నీలు పాడైపోవడం, పిల్లల్లో పెరుగుదల లోపించడం, కంటి సమస్యలు, చర్మవ్యాధులతో నానా అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. కెసిఆర్ మోసాలకు ఇప్పటికే నల్లగొండ నరకయాతన పడుతున్నదనీ, ఇప్పుడు ఆయన కొడుకు మోపయ్యిండని ఆరోపించారు. ఎవరు అడ్డువచ్చిన మూసీ విషయంలో వెనకడుగువేసే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. మూసీ డిపిఆర్ చేసిన మెయిన్ హార్ట్ టీ కంపెనీ 29 దేశాల్లో అద్భుతమైన కట్టడాలను కట్టిందనీ, ఎక్కడో పాకిస్థాన్‌లో కేసు అయ్యిందన్నారు. మూసీపై అవినీతి బురదజల్లడం దారుణమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం డీపీఆర్‌ను తయారు చేసిన వ్యాప్కోస్‌ను ఒడిశా సర్కారు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాయని గుర్తుచేశారు. కెటిఆర్ బంధువుల సంస్థ గ్లోబరిన పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయాన్ని ఎందుకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వేసి చెప్పలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం డిపిఆర్‌కు 2015లోనే రూ. 33 కోట్లు చెల్లించారనీ, ఇప్పుడు రూ. 140 కోట్లు ఇస్తుంటే గగ్గోలు పెడుతున్నరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే 16 కు 16 స్థానాల్లో గుణపాఠం చెప్పారని ఎద్దేవా చేశారు. అసలు మూసీ డీపీఆర్ పూర్తికాకముందే ఎందుకు లక్షల కోట్లని ఎగిరెగిరి పడుతున్నారని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో రూ.5 వేల కోట్లను దోచుకున్న కేసిఆర్ కుటుంబం అవినీతివల్లే ఇప్పటికి అనేక గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లే తాగుతున్నారని ఆరోపించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను మార్చుకున్న వాళ్లకు ప్రతీది ఎటిఎంలాగే కనిపిస్తున్నాయని చురకలు అంటించారు. రూ. రెండు వేల కోట్లు పెట్టి తొమ్మిది కిలోమీటర్ల ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పని పూర్తి చేస్తే ఇవ్వాలన్నారు. నల్లగొండలో పుట్టిన చిట్టి నాయుడు ఒకరు మొన్నటి ఎన్నికల్లో మూడు వేల ఓట్లతో గెలిచినప్పటికి ఆయనకు నల్గొండ సమస్యలు పట్టడం లేదన్నారు. బస్సు కిరాయిలు లేనోడికి ఇప్పుడు 80 ఎకరాల ఫామ్‌హౌజ్ ఉందనీ, ఉప్పల్‌లో వాటర్ ప్లాంట్ పెట్టి నడిపిన వ్యక్తి.. కేసీఆర్‌కు ఉన్నంత ఫామ్ హౌజ్ ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు. అధికారం అడ్డం పెట్టుకొని రూ.పది వేల కోట్లు దోచుకున్న ఆ చిట్టినాయుడు, ఎప్పుడూ నల్లగొండ బిడ్డల బాగుకోసం పనిచేయలేదని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంరతి కోమటిరెడ్డి